

సైనికా.. సలాం
దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరసైనికులకు గుర్తుగా డిసెంబర్ 7వ తేదీని ఫ్లాగ్ డే పేరుతో సాయుధ దళాల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. -8లో



బైక్‌ల చోరీ ముఠా అరెస్టు
జల్సాలకు అలవాటు పడి వివిధ జిల్లాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను బద్వేలు అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 25.4/22.2

జిల్లాలో మంగళవారం 22.2 - 25.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

జిల్లా అంతటా..

రబీ పంటల సాగుకు అనుకూలం

కడప అగ్రికల్చర్: జిల్లా అంతటా వర్షం కురిసింది. ఒంటిమిట్టలో అత్యధికంగా 142.2, మైలవరంలో అత్యల్పంగా 8.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వాన రాకతో రబీ ఆరుతడి పంటల సాగుకు మార్గం సుగమమైంది. ఈ సీజన్‌లో శనగతోపాటు వేరుశనగ కలుపుకొని దాదాపు రెండు లక్షల ఎకరాల్లో సాగు కానున్నాయి. ముఖ్యంగా జమ్మలమడుగు, పులివెందుల, వీఎన్‌పల్లె, ఎర్రగుంట్లతోపాటు పలు మండలాల్లో శనగ పంట సాగు కానుంది. ఈ తడి ఆరగానే రైతులు సాగు పనులు మొదలు పెడతారు.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

మండలం	వర్షం	మండలం	వర్షం
ఒంటిమిట్ట	142.2	బి.మఠం	36.2
అట్లూరు	90.2	పోరుమామిళ్ల	35.2
బద్వేలు	82.6	మైదుకూరు	33
గోపవరం	75.6	పులివెందుల	32.8
చెన్నూరు	75.2	వీఎన్‌పల్లి	29.2
కడప	71.2	ఎర్రగుంట్ల	28.6
సీకేదిన్నె	69.4	లింగాల	25.2
సిద్ధవటం	62.4	దువ్వూరు	24.2
పెండ్లిమర్రి	52.4	ముద్దనూరు	21.2
ఖాజీపేట	50	చాపాడు	19.6
చక్రాయపేట	49.2	ప్రొద్దుటూరు	17
వల్లూరు	46.2	సింహాద్రిపురం	14.6
కలసపాడు	45.2	రాజుపాళెం	14.2
కాశినాయన	43.6	జమ్మలమడుగు	13.4
వేంపల్లె	43.6	కొండాపురం	10.8
వేముల	42.4	పెద్దముడియం	9
కమలాపురం	38.6	తొండూరు	8.6
బి.కోడూరు	37.8	మైలవరం	8.2

తుపాన్.. పరేషాన్

మిచాంగ్ తుపాను జనాన్ని పరేషాన్ చేసింది.. రెండు రోజుల పాటు ఎడతేరిపి లేకుండా ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది.. జనజీవనాన్ని స్తంభింప చేసింది. ప్రధానంగా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.. వ్యవసాయ పంటలు నీట మునిగాయి.. ఉద్యాన పంటలు నేలకొరిగాయి.. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు.. నష్ట నివారణను తగ్గించారు.

- జిల్లాను వణికించిన మిచాంగ్
- నీట మునిగిన పంటలు
- అన్నదాతలకు తీవ్ర నష్టం
- లోతట్టు ప్రాంతాలు జలమయం



బద్వేలు మండలం తిరువెంగళాపురం గ్రామంలో నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతు

కడప అగ్రికల్చర్: మిచాంగ్ తుపాను జిల్లాను వణికించింది. అల్పపీడనం కారణంగా సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసింది. దీనికి తోడు ఈదురుగాలులు వీయడంతో జనం చలికి వణికిపోయారు. అత్యధికంగా ఒంటిమిట్టలో 142.2, అట్లూరులో 90.2, బద్వేలులో 82.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఉద్యాన, వ్యవసాయ పంటలు నీట మునిగాయి. ఉద్యాన పంటలకు సంబంధించి 446.70, వ్యవసాయ పంటలు 5112,5 హెక్టార్లలో ప్రాథమికంగా నష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో వరి పైరు గాలుల ధాటికి నేలకొరిగింది. ఈదరు గాలులకు పలు చోట్ల చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడ్డాయి. కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒంటిమిట్ట మండలంలోని కొత్తపల్లెకి వెళ్లే మార్గంలో చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

- వర్షాలకు దెబ్బతిన్న పంటలను వల్లూరు మండలం కొట్లూరు గ్రామంలో రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి ట్రాక్టర్‌లో రైతులతో కలిసి వెళ్లి పంటలను పరిశీలించారు. పడిపోయిన వరి పంట, మొలకెత్తిన వరిధాన్యాన్ని పరిశీలించి రైతులతో చర్చించారు.
- అట్లూరు మండల పరిధిలోని వలసపాళెం గ్రామంలో గడికోట లక్ష్మీదేవికి చెందిన ఇల్లు కూలిపోయింది.

చెట్టు విరిగిపడి కానిస్టేబుల్ మృతి



సిద్దవటం సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు (ఇన్‌సెట్) మృతిచెందిన సత్యకుమార్

సిద్దవటం సమీపాన భాకరాపేట వద్ద లెవెన్త్ బెటాలియన్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న సత్యకుమార్ చెట్టు విరిగి పడడంతో దుర్మరణం చెందాడు. చెన్నూరుకు చెందిన సత్యకుమార్ మంగళవారం ఉదయం విధులను నిర్వర్తించేందుకు తన ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా కడప-చెన్నై రహదారిలోని మలినేనిపట్నం గ్రామ సమీపానికి రాగానే.. చెట్టు విరిగి పడడంతో మృతి చెందాడు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది మృతుడికి సంతాపం తెలిపారు.

ఉద్యాన పంటలు 446.70 హెక్టార్లలో..

జిల్లాలో తొమ్మిది మండలాల పరిధిలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. ఇందులో ఒంటిమిట్ట మండలంలో 64 మంది రైతులకు చెందిన అరటి, బొప్పాయి, దోస పంటలు 86 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. చింతకొమ్మదిన్నె మండలంలో 25 మంది రైతులకు సంబంధించి అరటి, దోస 16 హెక్టార్లలో, సిద్దవటం మండలంలో 71 మంది రైతులకు చెందిన అరటి, బొప్పాయి, నిమ్మ, దోస, ఉల్లి, చామంతి 58.60 హెక్టార్లు, కాశినాయన మండలంలో 206 మంది రైతులకు సంబంధించి అరటి 159.60 హెక్టార్లు, మైదుకూరు మండలంలో 96 మంది రైతులకు సంబంధించి అరటి 83 హెక్టార్లు, బి.మఠం మండలంలో 33 మంది రైతులకు సంబంధించి వంకాయ, మిరప, టమాట, ఉల్లి, చామంతి 24,30 హెక్టార్లు, బద్వేలు మండలంలో ముగ్గురు రైతులకు సంబంధించి బొప్పాయి, మిరప, జెంచుగడ్డ పంటలు 2.20 హెక్టార్లు, ఖాజీపేట మండలంలో 22 మంది రైతులకు సంబంధించి మిరప, మునగ, టమాట పంటలు 13 హెక్టార్లు, అట్లూరు మండలంలో నలుగురు రైతులకు సంబంధించి నాలుగు హెక్టార్లలో దోస పంట దెబ్బతినింది. ఇలా జిల్లా వ్యాప్తంగా 524 మంది రైతులకు సంబంధించి 446.70 హెక్టార్లలో ఉద్యాన పంటలకు ప్రాథమికంగా నష్టం వాటిల్లినట్లు ఉద్యాన శాఖ అధికారులు నష్టపరిహార అంచనాలను వేశారు.



వల్లూరు : కొట్లూరులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

వ్యవసాయ పంటలు 5112.5 హెక్టార్లలో..

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 28 మండలాల పరిధిలో 171 గ్రామాల్లో, రబీ సీజన్‌కు సంబంధించి 23 మండలాల్లో 102 గ్రామాల్లో సాగు చేసిన వ్యవసాయ పంటలు 5112.5 హెక్టార్లలో నీట మునిగాయి. వీటిలో వరి, మినుము, జొన్న, మొక్కజొన్న, అరటి, మిరప, పొగాకు పంటలు ఉన్నాయి. ఇందులో 3799.5 హెక్టార్లలో వరి పంట నీట మునగడంతోపాటు నేలకొరిగింది. 863 హెక్టార్లలో మినుము, 199 హెక్టార్లు జొన్న, 154 హెక్టార్లు మొక్కజొన్న, 45 హెక్టార్లు అరటి, 44 హెక్టార్లు మిరప, 8 హెక్టార్లలో పొగాకు పంటలలో నీరు నిలిచి ప్రాథమికంగా దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు.



అట్లూరులో నీటి మునిగిన దోస పంట



కలసపాడు: మహానందిపల్లె వద్ద దెబ్బతిన్న మొక్కజొన్న పంట



అట్లూరు మండలం వలసపాళెంలో కూలిన ఇల్లు

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు



విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు రమణ

కడప కార్పొరేషన్: తుపాను వల్ల జిల్లాలో కొన్ని చోట్ల విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ మంగళవారం పర్యటించారు. దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గృహ, నీటి అవసరాలకు విద్యుత్‌ను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. ఎక్కడైనా తెగిపడిన విద్యుత్ లైన్లు ఉంటే ప్రజలు వాటిని తగలకుండా.. విద్యుత్ అధికారులు, సిబ్బందికి ఫోన్ చేయాలన్నారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలియజేయాలన్నారు. వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, సొంతంగా విద్యుత్ సరఫరాను ఆపివేయడం, ఆన్ చేయడం వంటివి చేయరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో బీభత్సం



పెనగలూరు : సింగనమల-ఈటమాపురం మధ్య ఉప్పొంగిన గుంజన నది



చిట్వేలి మండలం నాగవరంలో నేలకొరిగిన అరటి పంట

సాక్షి, రాయచోటి : అన్నమయ్య జిల్లాలో తుపాను బీభత్సం సృష్టించింది. ప్రధానంగా రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో పెనుగాలులకు అరటి, బొప్పాయి, తమలపాకు తోటలు నేల వాలాయి. రైల్వేకోడూరు పరిధిలోని పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరుతోపాటు రాజంపేట సెగ్మెంట్‌లోని వీరబల్లి, రాజంపేట తదితర ప్రాంతాల్లో అరటి పంటకు భారీ నష్టం వాటిల్లింది. సుమారు 3893 ఎకరాల్లో అరటి పంట నేల కొరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే మదనపల్లె ప్రాంతంలో వరికి సంబంధించి 150 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో బొప్పాయి దాదాపు 75 ఎకరాలు, తమలపాకు పంట 83 ఎకరాల్లో దెబ్బతినింది. టమాట, కూరగాయ, ఇతర పంటలకు కూడా కొంతమేర నష్టం వాటిల్లింది. పీలేరు మండలం మేళ్లచెరువు పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రక్షణ గోడ కూలి ఆవు మృతి చెందింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కిందపడటం, లైన్లు తెగిపోయిన కారణంగా సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విషయాన్ని గుర్తించిన విద్యుత్ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి ఆయా ప్రాంతాలకు చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



నందలూరు ఖాదర్‌వల్లి దర్గాలో కూలిన వందేళ్ల నాటి చింత చెట్టు

న్యూస్‌రీల్

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత



పెన్షన్ నగదు అందజేస్తున్న వలంటీర్ ఆంజనేయరెడ్డి

వల్లూరు : వల్లూరు గ్రామ వలంటీర్ ఎల్‌జీ ఆంజనేయరెడ్డి హైదరాబాద్ వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ అందజేశారు. వల్లూరుకు చెందిన ఎస్.మెహరున్నీసాకు వితంతు పెన్షన్ వస్తోంది. మోకాలు, మెడిమ గాయంతో బాధపడుతున్న ఆమె ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందింది. అనంతరం నడవ లేని స్థితిలో అక్కడే విశ్రాంతి తీసుకుంటోంది. సమాచారం అందుకున్న వల్లూరు గ్రామ వలంటీర్ ఎల్‌జీ ఆంజనేయరెడ్డి హైదరాబాద్ వెళ్లి మంగళవారం పింఛన్ అందజేశారు.

రామయ్య సన్నిధిలో బాలకిరణ్

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను మంగళవారం తెలుగు రాష్ట్రాల జనన, మరణ ధృవీకరణ రిజిస్ట్రేషన్ డైరెక్టర్ (ఐఏఎస్ సెంట్రల్ అధికారి) బాలకిరణ్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, జిల్లా వైద్య అధికారి డాక్టర్ నాగరాజు, మండల వైద్యాధికారి శ్వేత ఉన్నారు.

పింఛాకు జలకళ

- తలకోన, ఏనుబోతుల వంకల నుంచి వరదనీరు
- నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదల



పింఛా డ్యాం నాలుగు గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

రాజంపేట: అన్నమయ్య, చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని పింఛా జలాశయానికి జలకళ ఉట్టిపడుతోంది. ప్రస్తుత తుపాను వల్ల వరదనీరు భారీగా జలాశయంలోకి చేరుతోంది. చిత్తూరు జిల్లాలోని క్యాచ్‌మెంట్ ఏరియా తలకోన, ఏనుబోతుల వంకల నుంచి వరద నీరు డ్యాంలో వచ్చి చేరుతుంది. కాగా జలాశయం పునరుద్ధరణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ.80కోట్ల పనులు యథావిధిగా జరుగుతున్నాయి. వరదనీటి వల్ల ఎలాంటి ఆటంకం లేదని ఈ ఈ వెంకట్రామయ్య స్పష్టంచేశారు.

నాలుగుగేట్లు ఎత్తివేత..

డ్యాంలో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. ఉదయం 1600 క్యూసెక్కులు వచ్చి చేరుకుంది. దీంతో డ్యాంలో ఉన్న నాలుగుగేట్లను ఎత్తి దిగువకు 1400 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జలాశయం స్థితిగతులు, పునరుద్ధరణ పనులను జలాశయం అధికారులతో మాట్లాడుతూ మానిటరింగ్ చేశారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితి, గేట్లు తదితర అంశాలను అడిగి తెలుసుకుంటున్నారు.

లెఫ్ట్ కెనాల్‌లో నీటి విడుదల

పింఛా జలాశయానికి సంబంధించి లెఫ్ట్‌కెనాల్‌లో 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇక్కడ జరుగుతున్న డ్యాం పునరుద్ధరణ పనులకు ఎలాంటి అంతరాయం లేదంటున్న డ్యాం సిబ్బంది రింగ్‌బండ్, కాంక్రీట్ తదితరుల పనులు జరిగాయి. డిజైన్ మార్పులో భాగంగా గ్యాలరీ నిర్మాణం చేయాల్సి వుంటుంది. కాగా రైట్‌కెనాల్ డ్యామేజి కావడం వల్ల నీటిని విడుదల చేయలేకపోయారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జోన్‌ల క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. చివరి రోజు మంగళవారం మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించడంతో డ్రాగా ముగిశాయి.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపన కోసం ముందుకువచ్చే ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరచాలని అధికారులకు సూచించారు. పరిశ్రమలు జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువు పట్టు అన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఆ దిశగా జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేసి జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహద పడాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి, ఔత్సహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగిడాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. జిల్లా స్థాయి నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు పారిశ్రామిక పెట్టుబడులు, యూనిట్ల స్థాపనపై అవగాహన పెంపొందించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐడీపీ) 2020-23 ప్రకారం వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం ద్వారా ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి సంబంధించి 5 యూనిట్లకు, జనరల్ కేటగిరీకి సంబంధించి 9 యూనిట్లకు రూ.32.78 లక్షల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ముద్దనూరు : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బలరాముడు(53)అనే వ్యక్తి రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ రారాజు సమాచారం మేరకు నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం కంబాలదిన్నె గ్రామానికి చెందిన బలరాముడు కర్ణాటక రాష్ట్రంలోని హొస్పేట వద్ద స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మంగళవారం బస్సు దిగి స్థానిక రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీ రైలులో ప్రయాణించడానికి రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నాడు. స్థానిక రైల్వే గేటు సమీపంలో వెళ్తుండగా వెనుక వైపునుంచి వస్తున్న రైలు బలరాముడును ఢీకొంది. ఈ ఘటనలో అతను దుర్మరణం చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని ఆత్మహత్య



గౌసియా మృతదేహం

ముద్దనూరు : మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని గౌసియా బేగం(17) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు గౌసియా లింగాల మండలం ఇప్పట్లలోని గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియేట్ చదువుతోంది. గత కొంత కాలంగా పచ్చ కామెర్ల వ్యాధితో ఆమె బాధపడుతోంది. చికిత్స తీసుకుంటూ పెనికలపాడులో ఉంటోంది. వ్యాధి బాధను భరించలేక ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్యాంకర్ బోల్తా
– డ్రైవర్ దుర్మరణం



బోల్తాపడిన ట్యాంకర్

ముద్దనూరు : ముద్దనూరు-జమ్మలమడుగు ఘాట్‌రోడ్డులో ముద్దనూరుకు సమీపంలో మలుపులో మంగళవారం సిమెంటు లోడుతో వస్తున్న భారీ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన షణ్ముగం(41) అనే డ్రైవర్ దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు తమిళనాడు కుడుకొట్టై జిల్లా మెకుడైయ్యారప్పు గ్రామానికి చెందిన షణ్ముగం దాల్మియా కర్మాగారం నుంచి సిమెంటు లోడుతో బెంగళూరుకు ప్రయాణిస్తున్నాడు. స్థానిక ఎత్తులేటి కట్టవద్ద మలుపులోకి రాగానే వేగం అదుపు కాకపోవడంతో ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ట్యాంకర్ కిందపడటంతో అతని శరీరం నుజ్జునుజ్జయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సైనికా.. సలాం!

మాతృభూమి కన్నతల్లితో సమానం.. భూమాత ఒడిలో ప్రజలందరూ ఎల్లవేళలా క్షేమంగా ఉండాలని దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా కాస్తున్నారు భారత సైనికులు. భరతమాత సేవకు జీవితం అంకితం చేస్తున్నారు. కుటుంబం, బంధుత్వాలు, సుఖాలకు దూరంగా ఉంటూ దేశ రక్షణే లక్ష్యంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న సైనికులంటే మనదేశంలో ప్రత్యేక గౌరవం ఉంది. ఇప్పుడు అటువంటి సైనికుల పట్ల మనకు ఉన్న గౌరవాన్ని సైనికుల కుటుంబాలకు మేమున్నామంటూ తమవంతు చేయూతనిచ్చే అవకాశం వచ్చింది.. డిసెంబర్ 7వ తేదీని ఫ్లాగ్ డే పేరుతో సాయుధ దళాల దినోత్సవంగా నిర్వహించుకుంటాం.

రేపు సాయుధ దళాల పతాక దినోత్సవం



కడప నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం





విరాళాలు సేకరిస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్ (ఫైల్‌ఫొటో)

కడప స్పోర్ట్స్ : దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు, యుద్ధసమయంలో అవయవాలను కోల్పోయిన వీరసైనికులకు బాసటగా నిలిచేందుకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 1949 డిసెంబర్ 7న త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించడం ప్రారంభించారు. అయితే 1993లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ పేరుతో నిధిని ఏర్పాటు చేశారు. దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అప్పటి నుంచి ప్రతి యేటా డిసెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహించి 7వ తేదీన ఫ్లాగ్ డేగా ప్రజలు, సంస్థల నుంచి విరాళాలు సేకరిస్తారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ రంగాలకు చెందిన సైనికులు, వారి కుటుంబీకులు, వితంతువులకు చేయూతనిచ్చేందుకు విరాళాలను సేకరిస్తారు. విరాళాల ద్వారా వచ్చిన సొమ్మును అధికారుల ద్వారా వైకల్యం పొందిన మాజీ సైనికులు/వారి కుటుంబ సభ్యులు, వితంతువులకు అందజేస్తారు.

పతాక దినోత్సవం విశిష్టత..

దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వీరజవాన్‌లను, త్రివిధ దళాలలో ఉంటూ దేశ సరిహద్దులను కాపాడటంలో నిరంతరం సేవలందించే సైనికులను గుర్తుచేసుకుంటూ వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునే రోజే త్రివిధ సాయుధ దళాల పతాకదినోత్సవం. ఆ రోజు విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్ ప్రజలకు పతాకాన్ని అందించి హుండీ ద్వారా విరాళాలు స్వీకరిస్తారు. దీంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా విరాళాలను పంపవచ్చు. ప్రజలు ఎవరైనా మాజీ సైనికులకు చేయూతనివ్వదలచిన వారు కడప నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, ఆర్‌టీసీ బస్టాండు ఎదురుగా, స్పెన్సర్ వెనుకభాగాన, కడపలో అందజేసి రశీదు పొందవచ్చు. అదే విధంగా డీడీ రూపంలో కానీ, ఈసీఎస్ ద్వారా కానీ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంజీ రోడ్, విజయవాడ, అకౌంట్ నెంబర్ 33881128795, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0016857కు పంపవచ్చు. విరాళాలు ఇచ్చేవారికి సెక్షన్ 80 జి ఆదాయపు పన్ను చట్టం కింద పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది.

దేశసైన్యంలో జిల్లాలో ప్రాతినిధ్యం..

దేశ సైన్యంలో వైఎస్‌ఆర్ జిల్లాకు ప్రత్యేకస్థానం ఉంది. బద్వేలు నియోజకవర్గ పరిధిలో కొన్ని గ్రామాల్లో ప్రతి వీధిలో ఒక సైనికుడు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే వేల సంఖ్యలో సైన్యంలో జిల్లా వాసులు పనిచేయడం మన జిల్లాకు దక్కిన గౌరవం. జిల్లా వ్యాప్తంగా త్రివిధ దళాల్లో 4400 మంది మాజీ సైనికులు పనిచేసి ఉన్నారు. వీరిలో ఆర్మీలో 4151, ఎయిర్‌ఫోర్స్‌లో 175 మంది, నేవీలో 74 మంది ఉన్నారు. వీరితో పాటు సైన్యంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వితంతువులు ఆర్మీలో 921 మంది, ఎయిర్‌ఫోర్స్‌లో 45 మంది, నేవీలో 16 మంది ఉన్నారు. వీరితో పాటు రెండవ ప్రపంచ యుద్ధానికి సంబంధించిన వితంతువులు 14 మంది ఉన్నారు. అయితే వీరందరికి ప్రభుత్వ పరంగా పలు ప్రయోజనాలు లభిస్తున్నప్పటికీ వారి సేవలకు ఎంతచేసినా తక్కువే అన్నభావనతో పౌరులు స్పందించి తోచిన సాయం చేసి సైనికులకు వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే యత్నమిది.

సైనికుల త్యాగనిరతిని స్మరించుకుందాం..



దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన వీరసైనికులను, వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నాం. ఇందుకోసం ఎన్‌సీసీ కేడెట్స్ సేవలను ఉపయోగించుకుని 7వ తేదీ పతాక దినోత్సవం రోజున ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తాం. దేశసైనికులు చేసిన సేవలకు వెలకట్టలేం. తోచిన సాయం చేసి వారి కుటుంబాలకు మేమున్నామన్న భరోసా కల్పించడమే లక్ష్యం.

– ఐ.జి.రఘురామయ్య, జిల్లా సైనిక సంక్షేమాధికారి, కడప

నవశకం

ఖర్చు లేకుండా రేషన్ కార్డు వచ్చింది



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మా కుటుంబానికి రేషన్ కార్డు మంజూరైంది. మా తండ్రి ఆర్టీసీ ఉద్యోగి కావడంతో మా కుటుంబానికి రేషన్ కార్డు లేదు. మూడేళ్ల క్రితం నాకు వివాహం కావడంతో గ్రామ వలంటీర్ ద్వారా నా భార్య పేరుతో కొత్త రేషన్‌కార్డు జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నాం. ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా రేషన్ కార్డు వచ్చింది. జగనన్న సురక్ష మంచి కార్యక్రమం. – బైరీ సురేంద్రకుమార్, కేతవరం, చాపాడు మండలం

విద్యాప్రదాత వైఎస్ జగన్



నా చిన్న కుమారుడు 9 వ తరగతి చదువుతున్నాడు. పిల్లల చదువు కోసం గత ఏడాది నా కుమారునికి ట్యాబ్ కూడా ఇచ్చారు. బుడగ జంగం కులానికి చెందిన మాకు కుల ధ్రువీకరణ పత్రాలు లేక పోయినప్పటికీ మాకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో నా పెద్ద కుమారుడు పి.రవితేజకు వసతి దీవెన కూడా వచ్చింది. డిగ్రీ కూడా పూర్తి చేశాడు. అదే విధంగా నా చిన్న కుమార్తె రోజాకు ఇంటర్‌లో అమ్మ ఒడి నగదు అందింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక పథకం ద్వారా పైసా ఖర్చు లేకుండా మా పిల్లలందరూ విద్యావంతులు అవుతున్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ చేదోడు పథకాల ద్వారా మా జీవనోపాధికి ఈ ప్రభుత్వం చాలా తోడ్పడుతోంది.

– పి.లక్ష్మి శాంతమ్మ, కృపా కాలనీ, కడప

ద్విచక్ర వాహనాలు ఢీ – ఒకరి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



మృతుడు మస్తాన్

గుంతకల్లు టౌన్ : ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన బేల్దారి మస్తాన్ (27) గుంతకల్లులోని సీపీటీయా కాలనీకి చెందిన షబానాను రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలను ఉన్నారు. ఆరు రోజుల క్రితం మూడో కాన్పు కింద ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో తన బిడ్డను చూసేందుకు వచ్చిన మస్తాన్ మంగళవారం రాత్రి అదే కాలనీకి చెందిన వంశితో కలసి ద్విచక్ర వాహనంపై బజారు నుంచి ఇంటికి వెళుతుండగా ఆలూరు రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే బీరప్ప సర్కిల్ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఘటనలో మస్తాన్, వంశితో పాటు మరో బైక్‌పై ఉన్న నారాయణ, శర్మస్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మస్తాన్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శర్మస్‌ను కర్నూలుకు, నారాయణస్వామిని అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

జనన, మరణ నమోదు బాధ్యతగా చేపట్టాలి

- రాష్ట్ర జనన, మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ పి. బాలకిరణ్
- సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (సి.ఆర్.ఎస్)పై రిమ్స్‌లో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న జనన, మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ పి. బాలకిరణ్

కడప అర్బన్ : ప్రతి ఆరోగ్య కేంద్రంలో జనన, మరణ నమోదు ప్రక్రియను విధిగా, బాధ్యతగా చేపట్టాలని ఏపీ, తెలంగాణ ఉభయ రాష్ట్రాల జనన, మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ పి. బాలకిరణ్ వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం రిమ్స్ మెడికల్ కళాశాలలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్‌ఎస్) అమలు, నిర్వహణపై జీజీహెచ్ సూపరింటెండెంట్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జనన, మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ హాజరయ్యారు. జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ యూనిట్లను కలిగిన ఆరోగ్య కేంద్రాల్లో, జనన మరణ రిజిస్ట్రేషన్ ప్రక్రియను విధిగా, బాధ్యతగా నిర్వహించాలన్నారు. అందుకోసం వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జనన, మరణాల రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మూడు అంచెల ఉద్దేశాలున్నాయన్నారు. అందులో ఒకటి చట్ట సంబంధిత, రెండవది పరిపాలన సంబంధిత, మూడవది గణాంక సంబంధిత అంశాలన్నారు. జననాల రిజిస్ట్రేషన్ రికార్డు అనేది వ్యక్తి జన్మస్థల, జన్మదినానికి ఒక చట్టపరమైన ధృవపత్రాన్ని చేకూర్చగలదన్నారు. మరణాల రిజిస్ట్రేషన్ రికార్డు వ్యక్తిపై ఆధారపడ్డ వారికి ఆస్తి, జీవిత బీమా పంపకాలలో ఉపయోగపడుతుందన్నారు. గణాంక సంబంధిత ప్రయోజనాలలో కాన్పులు, మరణాల సమాచారం, జనాభా వృద్ధిలోని ప్రవృత్తిని అర్థం చేసుకోవడానికి. జనాభా వృద్ధి ప్రక్షేపించడానికి ఉపయోగపడుతుందన్నారు. కడప నగర కమిషనర్, రిమ్స్ ప్రత్యేకాధికారి జి. సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ జిల్లా జనాభా 22,13, 911 కాగా జిల్లాలోని 36 మండలాలలో మొత్తం 618 జనన, మరణ నమోదు యూనిట్లు ఉన్నాయన్నారు. అందులో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 62 కాగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో 8, గ్రామ పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో 548 రిజిస్ట్రేషన్ యూనిట్లు ఉన్నాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో చూస్తే కడప నగరంలోనే 49 సీఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్ యూనిట్లు, ప్రొద్దుటూరులో 40 సీఆర్‌ఎస్ ఉన్నాయన్నారు. రిమ్స్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ రిమ్స్ లేబర్ రూమ్ రిజిస్టర్‌లో అన్ని జననాలకు సంబంధించిన మాస్టర్ రికార్డ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, అన్ని విభాగాల హెచ్ఓడీలు తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 9న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జి. గీతా, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు మరింత సమాచారం కోసం 08562 258622, 244622 ఫోన్ నంబర్లు లేదా, ఈమెయిల్ అడ్రస్: డిస్ట్రిక్ట్ డాట్ ఈకోర్ట్స్ డాట్ జీవోపీ డాట్ ఇన్/కడప, డీఎల్‌ఎస్ఏకేడీపీఅట్‌దిరేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్ వెబ్‌సైట్లను సందర్శించాలన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూ.399కే పది లక్షల ప్రమాద బీమా

– తపాలశాఖ ఎస్పీ రాజేష్

రాజంపేట టౌన్ : తపాల శాఖలో రూ.399కే పది లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. స్థానిక హెడ్‌పోస్టాఫీసులో మంగళవారం తపాల ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ నగదుతో పెద్దమొత్తంలో బీమా సౌకర్యాన్ని పొందే అవకాశాన్ని తపాలశాఖ కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు తమకు సమీపంలో ఉన్న తపాల కార్యాలయాలకు ఆధార్‌కార్డు, నగదును తీసుకెళితే తమ సిబ్బంది బీమాకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. ముఖ్యంగా కుటుంబ యజమానికి ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఈ బీమా ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ అమరనాథ్‌రెడ్డి, పోస్టుమాస్టర్ హబీబుల్లా పాల్గొన్నారు.

అధిక వర్షాలు.. పంటల్లో జాగ్రత్తలు ఇలా..

జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు



కడప అగ్రికల్చర్ : మిచాంగ్ తుపాను వల్ల జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో చాలా పంటల్లో వర్షపు నీరంతా నిలిచి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వరిపంట..

వర్షానికి వరి చేను పడిపోయి నీట మునిగితే బూజు తెగులు వల్ల గింజ రంగు మారే అవకాశం ఉంటుంది. వర్షాలు తగ్గిన వెంటనే లీటరు నీటికి 1 మిల్లీలీటర్ ప్రొపికొనజోల్ లేదా 1 గ్రాము కార్బెండిజమ్ లేదా 1 గ్రాము కార్బెండిజమ్ ప్లస్ మాంకోజెబ్‌ను కలుపుకుని పిచికారీ చేసుకోవాలి.

- కోత కోసి ఒదెలు వర్షానికి తడిచినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని ఒదెలపై పడే విధంగా పిచికారీ చేసుకోవాలి, ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే ఒదెలను గట్ల పైకి తెచ్చుకుని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి.
- వరిపంట నీట మునిగినప్పుడు ఎక్కువగా ఉన్న నీరు కాలువల ద్వారా తీసి వేయాలి. పంట పడిపోకుండా గుబురుగా దబ్బలను నిటారుగా ముడి వేసి కట్టాలి. దీని వలన గింజ తడవకుండా మొలక రాకుండా కాపాడుకోవచ్చు.
- మెట్ట పంటలైన పత్తి, మిరప పంటల చేనులలో వర్షపునీరు నిలవకుండా వర్షపు నీరు వేగంగా, సులభంగా వెళ్లిపోయే విధంగా చేలగట్లలో ఎక్కువ సంఖ్యలో వాలుకు నిలువుగా గండ్లు చేయాలి.
- పత్తిపంట 3వ కోతకు కాయలు విచ్చుకుని పత్తితీతకు సిద్ధమైన కాయల నుండి విచ్చుకున్న పత్తిని తీయడం మంచిది.
- అలాగే పంట నీట మునిగినప్పుడు కాలువల ద్వారా మురుగు నీటిని తీసివేయాలి. తరువాత 20 గ్రాముల యూరియా లీటరు నీటికి లేదా 19: 19:19 లేదా 13:0:45ను 10 గ్రాములు నీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- మిరపలో తయారైన పచ్చి మిరప, పండు మిరపను చేను నుంచి కోసి అధిక వర్షాల నుంచి కాయలు తడవకుండా బూజు పట్టకుండా కాపాడుకోవచ్చు.
- శనగ పంటలో పంట నీట మునిగినప్పుడు మురుగునీరు తీసివేసి సీఎఫ్ 2.5 గ్రాములు లేదా టెబుకోనజోల్ 1 ఎంఎల్ లేదా హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ లీటరు నీటికి పిచికారీ చేయడం వలన బ్యాక్టీరియా ఎండు తెగులు, వడలు తెగులు రాకుండా పంటను కాపాడుకోవచ్చు.
- ముఖ్యంగా ఉద్యాన పంటలలో పంట నీట మునిగినప్పుడు ఎక్కువ నీరు తీసివేయాలి. అరటి చెట్లు పడిపోకుండా ఉండేందుకు ప్రాప్పింగ్ చేసుకోవాలి. పండ్ల మొక్కలు, కూరగాయల పంటలకు యాంత్రీకరణ మద్దతు ఇవ్వడం వలన పంట నష్టం తగ్గించవచ్చు.
- పంట నీట మునగడం వలన లేదా అధిక తేమశాతం వలన పంటల్లో సూక్ష్మధాతు లోపాలు కనిపిస్తాయి. దీని నివారణకు తుపాను తగ్గిన తరువాత మైక్రోన్యూట్రిన్ స్ప్రే చేయాలి.
- తుపాను తగ్గిన తరువాత వెంటనే ఎరువులు, పురుగుమందు పిచికారీ చేయరాదు. అలాగే కోసిన పంటను పొలాల్లో అలాగే వదిలి వేయరాదని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం నాయునిచెరువుపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు నవదీప్ స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. చదువుపై సరిగ్గా శ్రద్ధ పెట్టకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇంటి సమీపంలో జిల్లేడు పాలు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా పుంగనూరు మండలం ఈడిగపల్లె పంచాయతీ ఆరంట్లపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు అంజప్ప(33) వివాహ భోజనాల క్యాటరింగ్‌కు వెళుతూ జీవిస్తున్నాడు. స్థానికంగా రూ.20వేలు అప్పుచేశాడు. మంగళవారం అప్పు ఇచ్చిన వ్యక్తి భార్య అప్పు వసూలుకు వచ్చి దూషించడంతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితులను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాల చోరీ ముఠా అరెస్టు

బద్వేలు అర్బన్ : జల్సాలకు అలవాటు పడి వివిధ జిల్లాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బద్వేలు అర్బన్ పోలీసులు అరెస్టు చేసి రూ.10.50 లక్షలు విలువ చేసే 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బద్వేలులోని డీఎస్పీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. ప్రొద్దుటూరు టౌన్ వాజ్‌పేయినగర్‌కు చెందిన మల్లె భరత్ కుమార్, మైదుకూరు టౌన్, వెంకటసుబ్బయ్య కాలనీకి చెందిన జగన్నాథం అశోక్ బేల్దారి పనులు చేసుకుంటూ దుర్వ్యసనాలకు అలవాటుపడి ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతుండేవారు. వీరు రాత్రి సమయంలో ఇంటి ముందు నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాల హ్యాండిల్ లాక్ పగులకొట్టి బైక్‌లు చోరీ చేసేవారు. గత ఆరు నెలల కాలంలో బద్వేలు పట్టణంలో 3, ప్రొద్దుటూరు 1, ఆళ్లగడ్డ 1, హైదరాబాద్ 2 చొప్పున మొత్తం 7 బైక్‌లు చోరీ చేశారు. ఇటీవల బద్వేలు అర్బన్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అర్బన్ సీఐ యుగంధర్ నేతృత్వంలో సబ్ డివిజన్ క్రైంపార్టీ బృందం నిందితులపై నిఘా ఉంచారు. నిందితులు బద్వేలు – మైదుకూరు రహదారిలోని నందిపల్లె బ్రిడ్జి వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అరెస్టు చేసి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సబ్ డివిజన్ క్రైం పార్టీ ఏఎస్ఐ రాంభూపాల్‌రెడ్డి, కానిస్టేబుల్ అమరేశ్వర్‌రెడ్డి, అర్బన్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరాజు, కానిస్టేబుళ్లు రమేష్, వీరమోహన్, లక్ష్మీనరసయ్యలను డీఎస్పీ అభినందించి నగదు రివార్డు అందజేశారు. బద్వేలు అర్బన్ సీఐ పి.యుగంధర్ పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్